పచ్చిరొట్ట.. పైరుకు బలం !

- తక్కువ ఖర్చుతో నేల సారవంతం
- జిల్లాకు 3,047 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువులు మంజూరు
- అందుబాటులో జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు



నంద్యాల(అర్బన్): పచ్చిరొట్ట పంట దిగుబడిలో ప్రధాన భూమిక పోషిస్తుంది. భూసారం పెంపులో దిట్ట. భూముల్లో రేగడి మట్టి పోసేకంటే.. నేల స్వభావానికి అనుగుణంగా పచ్చిరొట్ట ఎరువు సాయంతో సారవంతంగా మార్చుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో నైరుతి రుతు పవనాలు ప్రారంభంకానున్నాయి.ఉపరితల ద్రోణి ఆవర్తనంతో ఇప్పటికే జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. నేలలో అదును ఏర్పడితే జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ కింద 2.24 లక్షల హెక్టార్లలో పంటల సాగు చేస్తారని అంచనా. కేసీ, తెలుగు గంగా, ఎస్ఆర్బీసీ, కుందూ నదుల పరివాహక ప్రాంతాల కింద దాదాపు 76 వేల హెక్టార్లలో వరి పంట సాగు కానుందని అధికారులు నివేదిక సిద్ధం చేస్తున్నారు. ఈ సమయంలో రైతన్నలు పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పిల్లిపెసర పూత దశ రాకముందే భూమిలో కలియ దున్నితే నిర్జీవమైన పుడమి వడి తిరిగి జీవం పోసుకుంటుందని వ్యవసాధికారులు చెబుతున్నారు.

జిల్లాకు 3047 క్వింటాళ్లు మంజూరు

జనుము, జీలుగ, పెసర, పిల్లి పెసర, అవసంద వంటి పైర్లను పూత దశ వరకు పెంచి భూమిలో కలియ దున్నడాన్ని పచ్చి రొట్ట ఎరువుగా పరిగణిస్తారు. పశువుల పేడ కంటే పచ్చిరొట్ట భూమిని పది రెట్లు ఎక్కువ సారవంతం చేస్తుంది. ఈ విత్తనాలకు ఇటీవల రైతుల నుంచి డిమాండ్ పెరగడంతో అధికారులు వాటి ధరలు, రాయితీలు ఖరారు చేశారు. జిల్లాకు ఈ ఏడాది 3,023 క్వింటాళ్ల జీలుగ, ఐదు క్వింటాళ్ల జనుము, 19 క్వింటాళ్ల పిల్లిపెసరతో కలిపి మొత్తం 3047 క్వింటాళ్లు కేటాయించారు. రైతులకు అవసరమైతే మరో 3 వేల క్వింటాళ్లకు ప్రతిపాదనలు పంపామని, మంజూరైన వెంటనే రైతులకు పంపిణీ చేస్తామన్నారు.

ఆర్ఎస్కేల్లో దరఖాస్తు చేసుకోవాలి

పచ్చిరొట్ట పైర్ల పెంపకం చాలా సులభమే. తక్కువ ఖర్చుతో భూమికి ఎక్కువ పోషకాలను అందించవచ్చు. పచ్చిరొట్ట సాగులో జీలుగ, జనుము, ప్రాచుర్యంలో ఉన్నాయి. వీటి సాగు వల్ల రసాయన ఎరువుల ఖర్చు తగ్గుతుంది. సబ్సిడీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఆసక్తి గల రైతులు ఆర్ఎస్కేల్లో దరఖాస్తు చేసుకోవాలి.

– మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి, నంద్యాల

ఏ ఏ విత్తనం ఎంత లాభమంటే..

- **జీలుగ...**
ఎకరా జీలుగ సాగుకు 12 నుంచి16 కిలోల విత్తనం అవసరం. ఈ పైరు ద్వారా 6నుంచి 8 టన్నుల పచ్చిరొట్ట ఎరువు వస్తుంది. దీనిని పొలంలో దున్నడంతో నత్రజని-30, భాస్వరం -8 పొటాషియం-25 కిలోలు పొందవచ్చు. మాగాణి భూముల్లో చేసుకుంటే మంచిది.
- **జనుము...**
ఎకరా జనుము సాగుకు 20 కిలోల విత్తనం కావాలి. పచ్చిరొట్ట 4 నుంచి 6 టన్నులు వస్తుంది. నత్రజని- 40, భాస్వరం-6, పొటాషియం -20 కిలోలు వస్తుంది. పూత రాక మునుపే భూమిలో కలియ దున్నాలి.
- **పిల్లి పెసర..**
ఎకరా పిల్లిపెసర సాగుకు 6నుంచి 8 కిలోలు చల్లు కోవాలి. పంట కోత దశలో దుక్కులు చేసుకుంటే 2 నుంచి 3 టన్నులు పచ్చిరొట్ట వస్తుంది. దీని ద్వారా నత్రజని 18, భాస్వరం 2.5, పొటాషియం-13 కిలోలు వస్తుంది.

అహోబిలంలో మాక్ డ్రిల్



మాక్డ్రిల్లో భాగంగా డైనింగ్ టేబుల్ కింద దాక్కున్న దృశ్యం



వంట గ్యాస్ బంద్చేసి పరిగెత్తుతూ..



గాయపడ్డ వారిని అత్యవసర చికిత్సకు ఇలా తరలించాలి

ఆళ్లగడ్డ: భారత్ – పాక్ మధ్య ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో కేంద్రహోం శాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలంలో సివిల్ మాక్ డ్రిల్ విజయవంతంగా ముగిసింది. రూరల్ సీఐ మురళీధర్రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు అహోబిలం దేవాలయం, ఇందిరమ్మ కాలనీల్లో మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఒక వేళ యుద్ధం అనివార్యమైతే పౌరులు పాటించాల్సిన నియమాలను వివరించారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ఎలా సురక్షితంగా కాపాడాలనే అంశాన్ని వివరించారు. కాల్పుల్లో గాయపడిన వారిని తోటి వారి సహాయంతో సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలనే అంశంపైఅవగాహన కల్పించారు.

బడి బయట పిల్లలపై సర్వే

ఉయ్యాలవాడ : పాఠశాలల్లో చేర్పించేందుకు బడి బయట ఉన్న పిల్లలను గుర్తించడానికి సర్వే చేపట్టినట్లు ఎంఈఓ 1 రఘురామిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 5 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలలోపు ఉన్న వారు బడి బయట ఉంటే గుర్తించి పాఠశాలల్లో చేరి్పంచేందుకు ఉపాధ్యాయులు, సిఆర్పీలు సమష్టిగా చొరవ చూపాలన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారికి ఓపెన్ స్కూల్ ద్వారా విద్యాబోధనలు అందించడం జరుగుతుందని ఎంఈఓ స్పష్టం చేశారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని బర్మాసెల్ కాలనీ తెలుగు బాప్టిస్ట్ రక్షణాలయంలో చిన్నారులకు ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ తరగతులు ముగిసినట్లు పాస్టర్ పాలాస్, గురువులమ్మ సుప్రియ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ శిబిరంలో పాటలు, డ్రాయింగ్స్, బైబిల్ సంబంధ అంశాలను నేర్పించడం జరిగిందన్నారు. అనంతరం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశామన్నారు.

నిందితుల అరెస్టు

ఆళ్లగడ్డ: రుద్రవరం మండలం పెద్దకంబలూరు గ్రామానికి చెందిన రమేష్ (25) అనే వ్యక్తి ఈ నెల 4వ తేదీన హత్యకు గురయ్యాడు. ఆ కేసుకు సంబంధించి నిందితులను అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు డీఎస్పీ ప్రమోద్ తెలిపారు. పాత కక్షల కారణంగా ఆ వ్యక్తిని అదే గ్రామానికి చెందిన అశోక్, వెంకటపతి, తలారి మద్దిలేటితో పాటు మరి కొందరు కలిసి హత్య చేసినట్లు మృతుడి భార్య లక్ష్మీదేవి రుద్రవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ వరప్రసాదు కేసు నమోదు చేయగా శిరివెళ్ల సీఐ దస్తగిరిబాబు విచారణ చేశారు. బుధవారం నిందితులు చిన్నకంబలూరు మెట్ట సమీపంలో కాశిరెడ్డినాయన ఆశ్రమం వద్ద ఉన్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచినట్లు డీఎస్పీ తెలిపారు. దాడిలో నిందితుల నుంచి హత్యకు ఉపయోగించిన పిడిబాకు, ఒక మోటర్ సైకిల్, ఒక ఆటో, మూడు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కనుల పండువగా మహానందీశ్వరుడి కల్యాణం

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవం బుధవారం కనుల పండువగా నిర్వహించారు. వేదపండితుడు చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో స్థానిక అలంకార మండపంలో ముందుగా స్వామి, అమ్మవార్లను కొలువుంచి గణపతిపూజ, పుణ్యాహవాచనం, మాంగళ్యధారణ, అక్షత సమర్పణ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి యాగశాలలో మహానందీశ్వరుడి దంపతులకు ఏకాంత సేవ నిర్వహించారు.

శ్రీశైల ద్వార క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు

శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణం కోసం గురువారం నుంచి నాలుగు రోజుల పాటు శ్రీశైల ద్వార క్షేత్రాల్లో అక్కడి ఆది దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. చతుర్ద్వార అర్చనగా పిలిచే ఈ కార్యక్రమం ఏటా వైశాక శుద్ధ ఏకాదశి నుంచి ఆయా ద్వార క్షేత్రాల్లో నిర్వహిస్తారు. ఈ నెల 12న శ్రీశైలంలో స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని గిరిప్రదక్షిణ అనే పేరుతో కూడా పిలుస్తారు. ఈ అర్చనలో ప్రతి ఆలయంలో స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్ర నామార్చనలు జరిపిస్తారు. విశేష కైంకర్యంలో శ్రీశైల దేవస్థానం తరుపున ప్రతి ఆలయంలో అక్కడి ఆది దేవతలకు వస్త్రాలు సమర్పిస్తారు. గురువారం శ్రీశైలక్షేత్ర తూర్పు ద్వారమైన ప్రకాశం జిల్లాలోని త్రిపురాంతకం, 9న దక్షిన ద్వారమైన వైఎస్సార్కడప జిల్లాలోని సిద్దవటం, 10న పశ్చిమ ద్వారమైన తెలంగాణ రాష్ట్రం జోగుళాంబ, 11న నాగర్కర్నూలు జిల్లాలోని ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర ఆలయాల్లో పూజలు నిర్వహిస్తారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీమతి కొట్టె సుబ్బమ్మ బాలాజీ మర్చెంట్స్ కల్యాణ మండపంలో బుధవారం వెంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. తర్వాత వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. కార్యక్రమంలో కొెట్టె కృష్ణమూర్తి, నారాయణ, శ్రీనివాస్, సురేష్ బాబు, కొెట్టె చంద్రశేఖర్, దేసు గురుచరణ్, దాస్ గుప్తా, అనుమాల శెట్టి, ఆదినారాయణ, సుబ్బరామయ్య, కృష్ణమూర్తి, లగిశెట్టి నవీన్, కొప్పర్ల పుల్లయ్య, పాల్గొన్నారు..

యాదగిరి నరసింహస్వామి ఆలయంలో పూజలు





ప్రత్యేక అలంకరణలో నూతన విగ్రహాలు

గోస్పాడు: మండలంలోని తెల్లపురి గ్రామంలో యాదగిరి నరసింహస్వామి నూతన ఆలయ నిర్మాణం చేపట్టడంతో ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు తాటిపాటి వెంకటరమణ శర్మ ఆధ్వర్యంలో ఉదయం ప్రాతఃకాల పూజలు, వేద పారాయణలు, మహా నారాయణ పారాయణ పూర్వక, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, పంచగవ్య, పంచామృత అభిషేకాలు తదితరవి నిర్వహించారు. అనంతరం దేవతా మూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు. నేడు దేవతామూర్తుల ప్రతిష్ఠోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్సీపీ లక్ష్యం



వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్రెడ్డి

బేతంచెర్ల: ప్రజా సంక్షేమమే వైఎస్సార్సీపీ లక్ష్యమని.. ఆ దిశగా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్రెడి అన్నారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లోని సమస్యలపై ఆరా తీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించారు. ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని, అధైర్య పడవద్దని సూచించారు. ప్రజా సమస్యలపై, ప్రజల పక్షాన పోరాడేందుకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ ముర్తుజావలి, వైఎస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి మురళీ కృష్ణ, నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, గూని నాగరాజు, ఇబ్రహీం, మనోహర్ నాయుడు, మురళీ, కుమార్ రెడ్డి, సలీం, సర్పంచ్ తిమ్మయ్య, పట్టణ, మండల కన్వీనర్లు తిరుమలేశ్వర్రెడ్డి, జాకీర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జూలేపల్లెలో అబ్దుల్లా స్వామి ఉరుసు



అబ్దుల్లా స్వామి దర్గా

గోస్పాడు: మండలంలోని జూలేపల్లె గ్రామంలో అబ్దుల్లా స్వామి ఉరుసు బుధవారం నుంచి ప్రారంభమైంది. మూడురోజుల పాటు జరిగే ఈ వేడుకలకు దర్గాను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. తొలి రోజు బుధవారం గంధోత్సవం, రెండోరోజు గురువారం ఉరుసు, మూడోరోజు శుక్రవారం జియారత్ నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

ఉచిత మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల (వ్యవసాయం): పట్టణంలోని నాగులకుంట రోడ్లో ఆంధ్ర ఫ్రేమ్ వర్కర్స్ వారు శ్రీ కన్యకా పరమేశ్వరి జయంతిని పురస్కరించుకుని వేసవితాపం నుంచి ఉపశమనం కోసం మజ్జిగను పంపిణీ చేశారు. నిర్వాహకులు వేణుగోపాల్,రమేస్, మధు మాట్లాడుతూ శ్రీ ఆహోబిలా స్వాతి గ్రూప్ మిత్రులు, దాతల సహకారంతో గత 27 రోజులుగా ఉచిత మినరల్ వాటర్, మజ్జిగను 300 మందికి పంపిణీ చేశామని వారు తెలిపారు.

9న కలెక్టరేట్ ఎదుట ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): విద్యారంగ పరిరక్షణ కోసం ఈనెల 9వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య తెలిపారు. బుధవారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యోగులకు పెండింగ్లో ఉన్న మూడు డీఏలను విడుదల చేయాలని, 12వ పీఆర్సీ కమిటీని నియమించాలని, ఐఆర్ను 30శాతానికి తగ్గకుండా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు భాస్కరరెడ్డి, వీరేశ్వరరెడ్డి, జాకీర్, హుసేన్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల సీడ్ సర్టిఫికేషన్ అధికారిగా శివశంకర్రెడ్డి



నంద్యాల(అర్బన్): నంద్యాల సీడ్ సర్టిఫికేషన్ అధికారిగా శివశంకర్రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న లక్ష్మీప్రసాద్ గుంటూరు హెడ్ ఆఫీసుకు బదిలీ అయ్యారు. గుంటూరు హెడ్ ఆఫీస్ సీడ్ సర్టిఫికేషన్ క్వాలిటీ కంట్రోల్గా విధులు నిర్వహిస్తున్న శివశంకర్రెడ్డి నంద్యాల ఎస్సీఓగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

పూజారికి ఆర్థిక సాయం



పూజారికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఆర్యవైశ్యులు

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరం శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ పూజారి భాస్కర శర్మకు ఆర్యవైశ్యులు రూ.1.25 లక్షలు ఆర్థిక సాయం అందించారు. ఈనెల 2వ తేదీన పూజరి ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగి నిత్యావసరాలు, వస్తు సామగ్రి కాలిబూడిదైంది. ఈ నేపథ్యంలో బుధవారం వారు స్పందించి సాయం అందించారు.

సాక్షిగణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సా యంత్రం సాక్షి గణ పతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశే ష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

అన్న ప్రసాదానికి రూ.లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు బుధవారం హైదరాబాద్కు చెందిన బి.రాధాకృష్ణమూర్తి రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షకుడు జి.రవికి అందజేశారు. దాతకు దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రం, లడ్డుప్రసాదాలు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

వైభవంగా వాసవీ కన్యకా పరమేశ్వరి గ్రామోత్సవం



బంగారు చీర అలంకరణలో వాసవీ మాత



సామూహిక కుంకుమార్చనలో మహిళలు



రుద్రవరంలో వాసవీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



చాగలమర్రిలో అమ్మవారికి పంచామృత అభిషేకం చేస్తున్న ఆర్యవైశ్య సభ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం):పట్టణంలోని నూనెపల్లిలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి గ్రామోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి జయంత్యుత్సవాలను పురస్కరించుకొని మొదట 108 కలశాలతో మహాకుంభాభిషేకం చేపట్టారు. ఆలయ శిఖరానికి సహస్ర ఘట్టాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బంగారు చీరతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించి వావీ మాతకు మహా మంగళహారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం అమ్మవారిని గ్రామోత్సవంతో పాటు దీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు భవానాసి వాసు, మహేష్ రామశేషు, సుబ్రహ్మణ్యం నాగరాజు శ్రీనివాసులు, రజనీకాంత్, ఆర్యవైశ్య మహిళా మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

రుద్రవరం: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం ఆర్యవైశ్యులు వాసవీ మాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి నిత్య పూజలు చేశారు. తర్వాత పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళ హారతి, తీర్థ ప్రసాదవితరణ గావించారు. వేద పండితుడు వాసవీ మాత సందేశాన్ని ఆర్యవైశ్యులకు చదివి వినిపించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చోళవేటి సూర్యనారాయణ, కోశాధికారి పెరుమాళ్ల నరసింహయ్య, ఆర్యవైశ్య పెద్దలు లింగం రంగ నాయకులు, కమిటీ సభ్యులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలో వాసవీమాత జయంతి వేడుకలను ఆర్య వైశ్య సభ ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం శ్రీవాసవిమాత పతాక ఆవిష్కరణతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. శాశ్విత ఉభయదారులుగా తోమ్మంద్రు బద్రీనాథ్, జగదీష్ కుమార్ వ్యవహరించారు. సాయంత్రం ఆర్యవైశ్య మహిళలు లక్షకుంకుమార్చన, రాత్రి ఆలయంలో అమ్మవారి రథోత్సవం నిర్వహించి మహామంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు. ఆర్య వైశ్య సభ ధర్మకర్త వంకదార లక్ష్మణబాబు, అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి కూరపాటి వరప్రసాద్, సభ్యులు నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలపాడులో ఘనంగా పెద్దమ్మ దేవర



గ్రామదేవత పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన గంగుల బిజేంద్రారెడ్డి, భూమా కిషోర్రెడ్డిని సన్మానిస్తున్న స్థానికులు



అమ్మవారికి సమర్పించటానికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో పెద్దమ్మతల్లి దేవర ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇల్లు బంధువులతో కళకళలాడింది. ఊరంతా పండుగ వాతవారణం కనిపించింది. దేవర సంప్రదాయం ప్రకారం మంగళవారం రోజున గ్రామంలో ప్రతి ఇంటి నుంచి చల్లా సేకరించి బాణలలో నింపు తిరిగి గ్రామంలోని ప్రజలకు పంచి పెట్టారు.తర్వాత పెద్దమ్మతల్లి అరుగుపై గ్రామ దేవత శ్రీపెద్దమ్మతల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. పలువురు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.కాగా దేవర సందర్భంగా వైఎస్సార్సీపీ నేత, ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, నాయకులు భూమా కిషోర్రెడ్డి, గంగుల విజయసింహారెడ్డి గ్రామానికి వచ్చారు స్థానిక ఆ పార్టీ నాయకుడు శేషు రమేష్ ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. వీరి వెంట ఎంపీపీ వీరభద్రుడు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్రెడ్డి, సర్పంచ్ గోవిందయ్య, నాయకులు మల్లారెడ్డి, పవన్ కుమార్ బాబు, రహిమాన్ తదితరులు ఉన్నారు.

చెత్త సంపద తయారీపై అవగాహన



ఉయ్యాలవాడ చెత్త సంపద కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి, ఆళ్లగడ్డ, దొర్నిపాడు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, హరితరాయబారులకు ఉయ్యాలవాడ చెత్తసంపద కేంద్రంలో బుధవారం పంచాయతీ రాజ్ జిల్లా కోఆర్డినేటర్ దస్తగిరిబాషా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాల నుంచిచెత్తను హరితరాయబారులు స్వీకరించే సమయంలో తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించాలన్నారు. సేకరించిన చెత్తతో సంపద కేంద్రాలలో సేంద్రియ ఎరువులు తయారు చేయాలన్నారు. వాటిని రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం పెరుగుతుందన్నారు. గ్రామాలలో కూడా పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏపీఓ హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

20న దేశ వ్యాప్త సమ్మె



చైర్పర్సన్కు వినతి పత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 20వ తేదీన దేశ వ్యాప్త సమ్మె చేపట్టనున్నట్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు మహమ్మద్గౌస్, అధ్యక్ష కార్యదర్శులు రామాంజనేయులు, రంగనాథులు తెలిపారు. బుధవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో కార్మికులు మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నిసా, కమిషనర్ నిరంజన్రెడ్డిని కలిసి డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె నోటీసు అందించారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మిక చట్టాలను, హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో సమ్మె ద్వారా సర్కారుపై తమ నిరసన తెలపనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు భాస్కరాచారి, కరీముల్లా ఆదాం, బాలదుర్గన్న, సుబ్రహ్మణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన బి.తాండ్రపాడు ఎద్దులు



బండలాగుతున్న వృషభాలు

కృష్ణగిరి: మండలంలోని అమకతాడు గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీల్లో కర్నూలు జిల్లా బి.తాండ్రపాడు వృషభాలు విజేతగా నిలిచాయి. పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి 8 జతల వృషభాలు పాల్గొనగా బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన ఆకేపోగు వరలక్ష్మి వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. రెండో స్థానంలో పెద్ద కొట్టాలకు చెందిన బోరెడ్డి నారాయణరెడ్డి, మిడుతూరుకు చెందిన సాయివర్ధన్ వృషభాలు ఉమ్మడిగా, మూడో స్థానంలో పసుపుల గ్రామానికి చెందిన డి.కృష్ణ, రాయలచెర్వుకు చెందిన రామచంద్రారెడ్డి వృషభాలు ఉమ్మడిగా, నాల్గో స్థానంలో నంద్యాల జిల్లా, సంజామల మండలం, కానాల గ్రామానికి చెందిన గుండం చెన్నారెడ్డి వృషభాలు, ఐదో స్థానంలో డోన్ మండలం యాపదిన్నె గ్రామానికి చెందిన కట్టల అరవిందు, సంజామల మండలం, చిన్న కానాల గ్రామానికి చెందిన సుంకన్న వృషభాలు ఉమ్మడిగా గెలుపొందాయి. ఎద్దుల యజమానులకు దాతలు, ఆలయ కమిటీ సభ్యులు వరుసగా రూ. 30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ. 5వేలు, రూ.3వేలు అందజేశారు.

నేడు న్యూ కేటగిరి విభాగంలో పోటీలు..

గురువారం న్యూ కేటగిరి విభాగంలో బండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపా రు. పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ. 40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ. 5వేలను అందిస్తున్నట్లు తెలిపారు.